# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన రాణి అహల్య బాయ్ హోల్కర్ త్రి శతాబ్ది జయంతోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు.**
2. **డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగే ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.**
3. **యోగాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.**
4. **రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**
5. **రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన తుది రాత పరీక్షను రేపు నిర్వహించనున్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో లోక్‌మాత దేవి అహల్య బాయ్ హోల్కర్ త్రి శాతాబ్ది జయంతి సందర్భంగా నిర్వహించిన మహిళా స్వశక్తి కరణ్ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్…28 సెకన్లు

--------------------------

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని కాట్రేనికోన మండలం చెయ్యేరులో నిర్వహించే పింఛన్ల పంపిణీ, పీ4 కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. చెయ్యేరులో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని.. ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్న చెరువు పనులను పరిశీలించనున్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు.

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ప్రకాశం జిల్లా చిలంకూరు గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి లబ్దిదారులకు పింఛన్లను పంపిణీ

చేశారు. నెల్లూరు నగరంలో పింఛన్లను పంపిణీ చేసిన పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ... దేశంలో అత్యధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు.

---------------------------

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధ్యాన్యమిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో లబ్ధిదారులకు మంత్రి ఈ రోజు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..26 సెకన్లు

---------------------------

స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణ ప్రణాళిక ద్వారా రుణాలు మంజూరు చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బ్యాంకర్లను ఆదేశించారు. వార్షిక రుణ ప్రణాళిక, మహిళ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు వంటి అంశాలపై ఆయన నిన్న విజయవాడలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే అదనపు రుణాలను ముద్ర వంటి పథకాల ద్వారా అందజేసేలా సహకరించాలని మంత్రి బ్యాంకర్లను కోరారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం, అన్నమయ్య, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజ కుమారి పాల్గొని .. మాట్లాడుతూ..

..వాయిస్... 27 సెకన్లు

---------------------------

యోగాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి సముద్రతీరంలో ఈరోజు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని.. యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్... 20 సెకన్లు

---------------------------

బుడమేరుకు అత్యవసరంగా పూడ్చిన 3 గండ్లు కలుపుతూ 23 కోట్లతో రక్షణ గోడను నిర్మిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో బుడమేరుకు గండి పడిన ప్రాంతాల్లో మంత్రి గత సాయంత్రం పర్యటించి సీసీ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. గత

ఏడాది భారీ వరదల కారణంగా బుడమేరుకు గండ్లు పడిన నేపథ్యంలో ఈ ఏడాది పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాకాలం మొదలయ్యేలోగా నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడ, గుంటూరు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థల కమిషనర్లతో ఫోన్లో మంత్రి సంభాషించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఓపెన్ డ్రైన్ల వద్ద ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

---------------------------

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన తుది రాత పరీక్షను రేపు నిర్వహిస్తున్నట్లు పోలీసు నియామక మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 6 వేల ఒక వంద కానిస్టేబుల్ ఉద్యోగాలకు 38 వేల 910 మంది పరీక్ష రాయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో జూన్ 6 నుంచి 30 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజు నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసి హాల్‌టికెట్లు పొందొచ్చని తెలిపారు. ఈ పరీక్షలకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 16 వేల 347 పోస్టులకు 3 లక్షల 35 వేల 401 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ పరీక్షలను మొదట ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ –టీజీటీ అభ్యర్థులకు, తరువాత స్కూల్ అసిస్టెంట్లకు, పోస్టు గ్ర్యాడ్యుయేట్ టీచర్లకు చివరిగా సెకండరీ టీచర్లకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు కొద్ది సేపటి క్రితం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

======================